కాల్వలు ఇలా.. నీరందేదెలా

- అధ్వానంగా కొత్తగూడెం, రెడ్లకుంట మేజర్ కాల్వలు
- పదేళ్ల నుంచి మరమ్మతులు చేపట్టని ప్రభుత్వం
- చివరి భూములకు నీరందక ఇబ్బందులు పడుతున్న రైతులు


మంగళితండా వద్ద అధ్వానంగా ఉన్న కొత్తగూడెం మేజర్ కాలువ

కోదాడరూరల్ : అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా తయారైంది నాగార్జున సాగర్ ఆయకట్టు పరిధిలోని పలువురి రైతుల పరిస్థితి. సాగర్ జలాశయంలో నిండుగా నీరున్నా సాగర్ కాల్వకు అనుసంధానంగా ఉన్న కాల్వల మరమ్మతులపై అధికారుల నిర్లక్ష్యంతో వ్యవసాయ భూములకు నీరందడం లేదు. సాగర్ ఎడమ కాల్వకు అనుసంధానంగా ఉన్న కొత్తగూడెం మేజర్ కాలువ అధ్వానంగా తయారు కావడంతో కోదాడ మండలంలోని చివరి ఆయకట్టు గ్రామాలైన చిమిర్యాల, మంగళితండా గ్రామాల రైతులకు సాగు నీరు అందని పరిస్థితి నెలకొంది. పదేళ్ల కిందట పూడిక తీసిన ఆ కాలువను ప్రస్తుతం పట్టించుకునే నాథుడే లేరు. దీంతో కాలువ కంపచెట్లు, పిచ్చిమొక్కలతో నిండిపోయింది. దీంతో సాగర్ నీటిపై ఆశలు వదులుకున్న పలువురు రైతన్నలు బావులు, బోర్లపై ఆధారపడి సాగు చేసుకుంటున్నారు. అధికారులు దృష్టి పెట్టి అనాధికార తూములను పూడ్చివేసి కాలువకు మరమ్మతులు చేపట్టి పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేస్తే చివర ఉన్న భూములకు నీరందుతుందని కర్షకులు అంటున్నారు.

రెడ్లకుంట కాలువ పరిధిలో ఇలా..

కోదాడ మండలంలో మరో ప్రధాన కాల్వ.. రెడ్లకుంట మేజర్ కాల్వ. ఇది ముక్త్యాల బ్రాంచ్ కాలువకు అనుసంధానంగా ఉంది. ఈ కాలువకు దాదాపుగా 330 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాల్సి ఉన్నప్పటికీ అధికారులు కేవలం 250 క్యూసెక్కుల లోపే నీటిని విడుదల చేయడంతో కాపుగల్లు శివారు వరకే నీరు చేరుతోంది. దీంతో దోరకుంట, నల్లబండగూడెం, రెడ్లకుంట గ్రామాలకు చెందిన దాదాపు 1100 వందల ఎకరాలకు సాగు నీరు అందడంలేదు. ఇక ఈ మేజర్ కాల్వపై ఉన్న తూములపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పలు చోట్ల నీరు వృథాగా పోతోందని రైతులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేసి రైతులకు నీటి ఇబ్బంది లేకుండా చూడాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

రెడ్లకుంట మేజర్ కాలువకు నీటి సామర్థ్యం పెంచాలి



ముక్త్యాల బ్రాంచ్ కాలువకు నీటిని విడుదల చేసి నాలుగు రోజులవుతున్నా నేటికీ దోరకుంట, నల్లబండగూడెం, రెడ్లకుంట గ్రామాల రైతులకు నీరు అందడం లేదు. అధికారులు రెడ్లకుంట కాల్వకు నీటి సామర్థ్యానికి పెంచి చివరి భూములకు నీరందేలా తగు చర్యలు తీసుకోవాలి.

– సీహెచ్. వెంకటేశ్వరరావు, రెడ్లకుంట

క్లుప్తంగా

ఎంపీఓ శ్రీనివాస్‌కు ఎన్టీఆర్ లెజెండరీ నంది అవార్డు


దారా శ్రీనివాస్‌కు అవార్డు అందజేస్తున్న బీసీ కమిషన్ చైర్మన్, నిర్వాహకులు

మునగాల : మునగాల మండల పంచాయతీ అధికారి డాక్టర్ దారా శ్రీనివాస్‌కు ఎన్టీఆర్ లెజెండరీ నంది అవార్డు లభించింది. పలు రంగాల్లో సేవలందించినందుకు గాను అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో 76వ స్వాతంత్య్ర దినోత్సవం, మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ, స్వాతంత్య్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు స్మారక దినం సందర్భంగా ఈయనకు అవార్డు అందజేశారు. శనివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతీలో ప్రముఖ విశిష్ట అతిథులు బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్, దైవజ్ఞశర్మ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నట్లు శ్రీనివాస్ తెలిపారు. సాహిత్య రంగంలో కవిగా, రచయితగా తాను చేసిన కృషిని, సామాజిక రంగంలో చేస్తున్న సేవలకు ఈ అవార్డుకు తనను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ అవార్డుకు ఎంపిక చేసిన అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు, చైర్మన్ డాక్టర్ ఎస్.సరోజినమ్మకు కృతజ్ఞతలు తెలిపారు.

పీజీ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో స్టేట్ సెకండ్ ర్యాంక్


పూల సౌమ్య

చిలుకూరు : ఉస్మానియా విశ్వవిద్యాలయం శుక్రవారం విడుదల చేసిన పీజీ ఎంట్రెన్స్ ఫలితాల్లో చిలుకూరు గ్రామానికి చెందిన పూల సౌమ్య బోటనీ సబ్జెక్టులో స్టేట్ రెండవ ర్యాంక్ సాధించింది. ఈమె కోదాడలోని కేఆర్‌ఆర్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసింది. ఈ సందర్భంగా సౌమ్యను తల్లిదండ్రులు పూల వాసు, జయంతి, గ్రామస్తులు, అధ్యాపకులు అభినందించారు.

సీనియర్ సిటిజన్స్ సంఘం గ్రామ కమిటీ ఎన్నిక


వి.పుల్లారెడ్డి, అధ్యక్షుడు


రాజుల అంజయ్య, ప్రధాన కార్యదర్శి

మునగాల : మండలంలోని ఆకుపాములలో తెలంగాణ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ గ్రామ కమిటీని శనివారం ఆ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆరె.రామకృష్ణారెడ్డి సమక్షంతో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వల్లపురెడ్డి పుల్లారెడ్డి, ఉపాధ్యక్షుడిగా వి.రామరాజు, ప్రధాన కార్యదర్శిగా రాజుల అంజయ్య, సహాయ కార్యదర్శిగా బాలెంల నర్సయ్య, కోశాధికారిగా వల్లపురెడ్డి వెంకటరెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా దొంతగాని అంజయ్య, కార్యవర్గ సభ్యులుగా రాజుల పుల్లయ్య, పోలంపల్లి వెంకయ్యలను ఎన్నుకున్నారు.

అనారోగ్య బాధితుడికి రూ.30వేల ఆర్థికసాయం

సాక్షి ఎఫెక్ట్..

మునగాల : మండలంలోని బరాఖత్‌గూడెం గ్రామానికి చెందిన మొలుగూరి శ్రీను –మంగమ్మ దంపతుల రెండవ కుమారుడు తేజ గత పదిరోజుల క్రితం తీవ్ర అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చేరాడు. తేజది నిరుపేద కుటుంబం కావడంతో శనివారం సాక్షి దినపత్రికలో 'నిరుపేద యువకుడికి తీవ్ర కష్టం' అనే శీర్షికన వచ్చిన కన్నీటి గాథకు పలువురు దాతలు స్పందించి ఆర్థికసాయం అందించేందుకు ముందుకు వచ్చారు. శనివారం వివిధ ప్రాంతాల నుంచి సుమారు రూ.30 వేల ఆర్థికసాయాన్ని ఫోన్‌పే, గూగుల్‌పేల ద్వారా వచ్చినట్లు తేజ సోదరుడు సందీప్ సాక్షికి తెలిపారు. తన సోదరుడు దీన గాథను ప్రచురించి వెలుగులోకి తీసుకువచ్చిన సాక్షి పత్రిక యాజమాన్యానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

బీసీ కులగణన చేపట్టాలి

హుజూర్‌నగర్ : రాష్ట్రంలో బీసీ కులగణన యుద్ధప్రాతిపదికన చేపట్టాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.ధనుంజయనాయుడు శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 12న బీసీ డిమాండ్ డే గా పాటిస్తూ జిల్లా కలెక్టర్ కార్యాలయం నిర్వహించబోయే జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. దేశ జనగణనలో బీసీ కుల గణన జరపాలని, కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, రూ.2 లక్షల కోట్లతో బీసీల సమగ్ర సంక్షేమానికి అభివృద్ధికి చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీల సంక్షేమానికి ఏడాదికి రూ.20 వేల కోట్లు ఖర్చు చేయాలని, కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మునగాల : మునగాల సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఇండస్ట్రియల్ లైన్‌కు మరమ్మతులు చేపడుతున్నందున మండల కేంద్రంలోని 33 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని ట్రాన్స్‌కో ఏఈ వికాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ


ఉపకరణాలు పొందిన దివ్యాంగులతో మైహోం పరిశ్రమ సిబ్బంది

మేళ్లచెరువు : మండల కేంద్రం పరిధిలోని మైహోం సిమెంట్ పరిశ్రమ సహకారంతో జై గురుదేవ్ చారిటబుల్ ట్రస్టు సౌజన్యంతో మేళ్లచెరువులో శనివారం దివ్యాంగులకు ఉచిత ఉపకరణాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు రూ.19 లక్షల విలువైన వివిధ రకాలు ఉపకరణాలు, ఆర్టిఫీషియల్ లింబ్స్‌ను మైహోం పరిశ్రమ వైస్ చైర్మన్ జూపల్లి వినోద్‌రావు, చీఫ్ విజిలెన్స్ మాజీ కమిషనర్ కేవీ.చౌదరి, టెక్నికల్ డైరెక్టర్ నారంగ్, జనరల్ మేనేజర్ మునగాల రాంమ్మోహన్‌రావు, జై గురుదేవ్ ట్రస్టు చైర్మన్ జగదీష్, యూనిట్ హెడ్ శ్రీనివాసరావు చేతుల మీదుగా అందజేశారు. ఇందులో 34 మందికి ట్రైసైకిల్, 31 మందికి వీల్ చైర్స్, 45 మందికి హియరింగ్ ఎయిడ్స్, 46 మందికి ఆర్టిఫీషియల్ లింబ్స్, ఒకరికి పోలియో క్లిప్పర్‌లు అందించినట్లు పరిశ్రమ సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో జీఎం నాగేశ్వరరావు, జగన్నాథరావు, ఏజీఎం శ్రీనివాస్, పరిశ్రమ అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నేటి నుంచి బరాఖత్‌గూడెంలో పవిత్రోత్సవాలు

మునగాల : మండలంలోని బరాఖత్‌గూడెం గ్రామ పంచాయతీ శివారులో గల స్వయంభూ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం నుంచి నాలుగు రోజుల పాటు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పాలిశెట్టి శ్రీనివాస్, దేవాలయ అర్చకులు కందాళ శ్రీనివాసాచార్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రావణ శుద్ధ సప్తమి సందర్భంగా ఉదయం శ్రీవిష్ణుసహస్రనామ స్తోత్రం, సాయంత్రం పుణ్యాహవాచనం, రక్షబంధనం ఉంటుందని పేర్కొన్నారు. సోమవారం శ్రావణ శుద్ధ అష్టమి సందర్భంగా సుప్రభాతంతో మొదలై యాగశాల ప్రవేశం, తదితర కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. మంగళవారం శ్రావణ శుద్ధ నవమి, బుధవారం శ్రావణ శుద్ధ దశమి సందర్భంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఉత్సవాలలో భక్తులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

ముమ్మరంగా ఆర్-3 కాలువ పూడికతీత


ఆర్- 3 కాలువలో పూడికతీత పనులు చేపడుతున్న దృశ్యం

నేరేడుచర్ల : నేరేడుచర్ల పట్టణం నుంచి ప్రవహిస్తున్న ఆర్– 3 కాలువ చివరి భూములకు నీరందించడమే లక్ష్యంగా అధికారులు శనివారం పూడికతీత పనులను ముమ్మరంగా చేపట్టారు. కాలువలో చెత్తాచెదారం, పూడికను తొలగించారు. అయితే నేరేడుచర్ల పట్టణ సమీపంలో కాలువలో చెత్తాచెదారం ఇరుక్కొని నీరు ఇళ్లలోకి వెళ్లి ఆ ప్రాంత ఇబ్బందులు పడుతుండడంతో అధికారులు ఆయా ప్రాంతాలలో చెత్తాచెదారాన్ని తొలగించారు. కాగా, కాలువ సామర్థ్యం కంటే తక్కువ నీటిని విడుదల చేస్తున్నప్పటికీ చివరి భూములకు నీరందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వైభవంగా సుదర్శన జయంతి మహోత్సవం


సుదర్శన యాగం చేస్తున్న అర్చకులు

భానుపురి : పట్టణంలోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం సుదర్శన జయంతిని పురస్కరించుకొని సుదర్శన మహాయాగాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజామునే స్వామివారికి ప్రత్యేక పంచామృత అభిషేకాలు జరిపారు. శ్రీ సుదర్శన యాగానికి అంకురార్పణ చేశారు. తదనంతరం అగ్నిప్రతిష్ఠ చేసి, సుదర్శన మహాయాగం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీసుదర్శన శతక పారాయణం, మూల మంత్ర హోమం, మహా పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలచార్యులు, ఆలయ కార్యనిర్వహణ అధికారి వై.శ్రీనివాసరెడ్డి, అర్చకులు సంకర్షణాచార్యులు, శ్రీహరిచార్యులు, ఫణికుమార్ ఆచార్యులు, ఉపేంద్ర ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు గ్రామస్తుల ఆర్థికసాయం

అనంతగిరి : మండలంలోని పాలారం గ్రామంలో పాముకాటుకు గురైన గాదె రామ్మూర్తి(65) చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. ఆయనది నిరుపేద కుటుంబం కావడంతో అంత్యక్రియలకు కిష్టాపురం గ్రామానికి చెందిన సామాజికవేత్త తూమాటి ఉపేందర్‌రెడ్డి రూ.5వేలు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మొక్కా కాశీగౌడ్ రూ.5వేల ఆర్థికసాయాన్ని శనివారం అందజేశారు. దీంతో గ్రామస్తులు సైతం ముందుకొచ్చి మృతుని అంత్యక్రియలకు సుమారు.రూ.25 వేలు అందజేశారు.

యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

సూర్యాపేటటౌన్ : ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) 50వ అవతరణ దినోత్సవాన్ని శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని టీఎస్ యూటీఎఫ్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్ రాములు జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం యూటీఎఫ్ పని చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.సోమయ్య, యాకయ్య, వెంకటయ్య, రమేష్, లాలు, ఆర్.శ్రీను, శ్రీనివాసాచారి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఇరుకు రోడ్డు.. ఇరువైపులా కంపచెట్లు


చిలుకూరు శివారులోని అభయాంజనేయస్వామి ఆలయం వద్ద రోడ్డును కమ్మేసిన చెట్లు


రామాపురం రోడ్డులో ఇలా..

చిలుకూరు : మండలంలోని రామాపురం రోడ్డును కంపచెట్లు కమ్మేశాయి. దీంతో నిత్యం ఈ రోడ్డులో రాకపోకలు సాగించే ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అసలే రోడ్డు వెడల్పు తక్కువగా ఉంది. దానికి తోడు రోడ్డును ఇరుపక్కల కంపచెట్లు కమ్మేయడంతో మూలమలుపుల వద్ద ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనబడక ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డుకు ఇరుపక్కల కంపచెట్లను తొలగించాలని కోరుతున్నారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలి

మునగాల : తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణయాదవ్ కోరారు. శనివారం మునగాల మండల కేంద్రంలో నిర్వహించిన బీసీ విద్యార్థి సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గానికి ఒక పరిశ్రమ ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని, యువత స్వయం ఉపాధి కోసం బ్యాంకుల నుంచి సబ్సిడీతో రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి కల్పించాలని, స్కిల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీలు ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగ అవకాశాల కోసం శిక్షణ ఇప్పించాలని కోరారు. ఈ సమావేశంలో విద్యార్థి సంఘం నాయకులు నాగేశ్వరరావు, మహేష్, మణితేజ, సతీష్, నరేష్ పాల్గొన్నారు.

శ్రావణమాస పూజలు


ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి

నేరేడుచర్ల : శ్రావణ మాసం సందర్భంగా నేరేడుచర్ల పట్టణంలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు ఇరువంటి శ్రీనివాసశాస్త్రి ఆధ్వర్యంలో శ్రీదేవిభూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవత విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి దర్శన భాగ్యం కల్పించారు.

నాణ్యమైన చేపపిల్లలు పంపిణీ చేయాలి

చిలుకూరు : ప్రస్తుతం వర్షాలు సమృద్ధిగా కురిసి చెరువుల్లో నీళ్లు నిండుగా ఉన్నాయని, ప్రభుత్వం చెరువుల్లో నాణ్యమైన చేప పిల్లలను పంపిణీ చేయాలని ముదిరాజ్ సంఘం కోదాడ నియోజకవర్గ కన్వీనర్ ముసి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం చిలుకూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. చేప పిల్లలను గతంలో మాదిరిగా కాకుండా నేల స్వభావాన్ని బట్టి చెరువుల్లో చేప పిల్లలను వేయాలన్నారు.

మున్నూరు కాపు సంఘం సమావేశానికి తరలిరావాలి

హుజూర్‌నగర్ : హైదరాబాద్‌లోని బర్కత్‌పురాలో ఆదివారం నిర్వహించబోయే మున్నూరు కాపు సంఘం రాష్ట్ర సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జేవీఆర్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. మున్నూరు కాపు సంఘం నాయకులు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.

నాటుకోళ్లు మృతి.. పోలీసులకు ఫిర్యాదు

కోదాడరూరల్ : పొలంలో రైతు ఎలుకల నివారణకు పెట్టిన మందు తిని తన నాటుకోళ్లు మృతి చెందాయని, సదరు రైతుపై చర్యలు తీసుకోవాలని శనివారం ఓ మహిళ కోదాడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కోదాడ మండలంలోని గుడిబండ గ్రామానికి చెందిన నర్సింగోజు గీత తన ఇంట్లో నాటు కోళ్లను పెంచుతోంది. తన ఇంటి పక్కనే ఉన్న పొలంలో రైతు పెట్టిన ఎలుకల నివారణ మందు తిని ముప్పైకి పైగా తన నాటుకోళ్లు మృతి చెందాయని ఆరోపిస్తూ.. మృతి చెందిన కోళ్లను స్టేషన్‌కు తీసుకొచ్చి రైతుపై ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు విచారణ చేపట్టారు.

మానసిక వికలాంగుల కేంద్రంలో అన్నదానం


అన్నదానం చేస్తున్న ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ దంపతులు

మునగాల : మునగాల ఎస్‌ఐ బి.ప్రవీణ్‌కుమార్ దంపతులు తమ కుమారుడు భైరవరుద్ర పుట్టిన రోజు సందర్భంగా శనివారం కోదాడ పట్టణంలోని శనగల రాధాకృష్ణ మానసిక వికలాంగుల కేంద్రంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకుడు శనగల రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- డిప్యూటీ డీఎంహెచ్‌ఓ నిరంజన్


జ్వరపీడితులను పరీక్షిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ నిరంజన్

హుజూర్‌నగర్‌రూరల్ : ప్రతిఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ నిరంజన్ అన్నారు. శనివారం హుజూర్‌నగర్ మండలంలోని గోపాలపురంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని వైద్యాధికారి డాక్టర్ కళ్యాణితో కలిసి ఆయన పరిశీలించి మాట్లాడారు. జ్వరపీడితుల రక్త నమూనాలు సేకరించి తగిన వైద్యం అందించాలని సిబ్బందికి సూచించారు. ఇంటి పరిసరాల్లో పగిలిన కుండలు, పాత కూలర్లు, పాత టైర్లు, నీటి తొట్లతో నీరు నిల్వ ఉండకుండా చూడాలని తద్వారా దోమల వ్యాప్తిని నివారించవచ్చన్నారు. ప్రతి శుక్రవారాన్ని డ్రై డేగా పాటించాలన్నారు. ఆయన వెంట సీహెచ్‌ఓ పద్మ, హెల్త్ అసిస్టెంట్ ఇందిరాల రామకృష్ణ, ఝాన్సీ, ఆశా కార్యకర్తలు, సిబ్బంది ఉన్నారు.

క్రీడలతో పని ఒత్తిడి దూరం


క్రీడలను ప్రారంభిస్తున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాముల రాంరెడ్డి

హుజూర్‌నగర్ : క్రీడలతో పని ఒత్తిడి దూరమవుతుందని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాముల రాంరెడ్డి అన్నారు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులకు, న్యాయశాఖ సిబ్బందికి, కోర్టు కానిస్టేబుళ్లకు నిర్వహించే క్రీడా పోటీలను శనివారం పట్టణంలోని బార్ అసోసియేషన్ హాల్‌లో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసాన్ని కలిగిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ క్రీడల కార్యదర్శి జి.వెంకటేష్‌నాయక్, న్యాయవాదులు కాల్వ శ్రీనివాసరావు, కె.బాలకృష్ణ, జె.నాగేశ్వరరావు, సీహెచ్.యాదగిరి, జయరామయ్య, వి.అంజయ్య, జె.సత్యనారాయణ, బి.నరేష్, సురేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మికులను విస్మరించిన ప్రభుత్వాలు


సమావేశంలో మాట్లాడుతున్న సైదులు

హుజూర్‌నగర్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయ కార్మికుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించాయని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సైదులు ఆరోపించారు. శనివారం హుజూర్‌నగర్‌లోని అమరవీరుల స్మారక భవన్‌లో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం హుజూర్‌నగర్ కమిటీ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెట్, ఉపాధి, సంక్షేమం, కనీస వేతనాలు అనే అంశంపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర బడ్జెట్ కార్పొరేట్ శక్తులను, విదేశీ పెట్టుబడిదారుల సంతృప్తి పరచేదిగా ఉంది తప్ప దేశంలో ఉన్న ప్రజల కష్టాలను తీర్చేలా లేదని ఆరోపించారు. ఆహార భద్రతను విస్మరించినట్లు ఉందని అన్నారు. నేషనల్ క్రైమ్ బ్యూరో ప్రకారం రైతుల ఆత్మహత్యల కంటే గ్రామీణ పేదల ఆత్మహత్యలు రోజురోజుకూ పెరుగుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి డి.ధనుంజయనాయుడు, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు పల్లె వెంకటరెడ్డి, ప్రజా సంఘాల నాయకులు హుస్సేన్, శీలం శ్రీను, వి.సైదులు, జె.వెంకటేశ్వర్లు, పి.వెంకటరెడ్డి, పి.వెంకట్‌నారాయణ, జి.సైదయ్య, నరసింహారావు, మల్లయ్య, రమేష్, శశికళ తదితరు పాల్గొన్నారు.

ఎల్-30, 31 ఎత్తిపోతలకు నీటి విడుదల


నీటిని విడుదల చేస్తున్న లిఫ్ట్ చైర్మన్ వెంకటేశ్వరరావు

మునగాల : మండలంలోని కొక్కిరేణి శివారులో సాగర్ ఎడమకాలువపై గల ఎల్– 30, 31 ఎత్తిపోతల పథకాలకు శనివారం లిఫ్ట్ చైర్మన్ మేదరమెట్ల వెంకటేశ్వరరావు సాగు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు నీటిని వృథా చేయకుండా వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈ నరసింహామూర్తి, లిఫ్ట్ మాజీ చైర్మన్ పోటు లక్ష్మయ్య, మాజీ సర్పంచ్‌లు సారెడ్డి సైదిరెడ్డి, రావులపెంట వెంకన్న, మేకల నాగేశ్వరరావు, రైతులు నందిగామ సైదులు, పోటు అశోక్‌కుమార్, ఎస్.చంద్రయ్య, బండి లచ్చయ్య, సైదులు, వెంకయ్య, నారాయణ, వెంకటయ్య, లచ్చిరెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


మృతి చెందిన లక్ష్మీనారాయణ

నేరేడుచర్ల : నేరేడుచర్లకు చెందిన లక్ష్మీనారాయణ నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు నేరేడుచర్ల ఎస్‌ఐ రవీందర్‌నాయక్ తెలిపారు. అనారోగ్యంతో లక్ష్మీనారాయణ నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో చేరగా.. చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులు, బంధువుల వివరాలు తెలియలేదని, ఆస్పత్రిలో చేరిన సమయంలో తన పేరు లక్ష్మీనారాయణ, ఊరు నేరేడుచర్ల అని నమోదు చేయించినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలోనే ఉంచినట్లు పేర్కొన్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో లేదా నేరేడుచర్ల పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

అవయవదానంపై అవగాహన కల్పించాలి

మిర్యాలగూడ టౌన్ : అవయవదానంపై అవగాహన కల్పించాలని ఆలిండియా శరీర అవయవాల దాతల సంఘం అధ్యక్షురాలు గూడూరు సీతామహాలక్ష్మి అన్నారు. శనివారం మిర్యాలగూడలోని కేఎల్ఎన్ జూనియర్ కళాశాలలో వాసవీ క్లబ్, శరీర అవయవదాతల సంఘం, సావిత్రీబాయి పూలే ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 'అవయవదానం- ప్రాణదానం'అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో అవయవదానం ఆవశ్యకతపై అవగాహన కల్పించేందుకు ప్రతి ఏటా ఆగస్టు 13న ప్రపంచ అవయవదాన దినోత్సవం జరుపుతున్నట్లు తెలిపారు. ఎవరైనా అవయవదానం చేయించాలనే అనుకునే వారు అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులో ఉన్న టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలన్నారు. సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు కాట్రగడ్డ భారతి, రాష్ట్ర నాయకులు కన్యాకుమారి, కృష్ణ, కోల సైదులు, మిట్టపల్లి విజయభాస్కర్, సింగు రాంబాబు, సామ శ్రీనివాస్, గూడూరు శ్రీనివాస్‌రావు ఉన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు



చిలుకూరులో హైవే పక్కన ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఒరిగి ఉన్న విద్యుత్ స్తంభం


కోదాడ- జడ్చర్ల జాతీయ రహదారి వెంట ఒరిగిన విద్యుత్ స్తంభం

- హైవేవెంట ఒరిగిన స్తంభాలు
- భయాందోళనలో ప్రజలు

చిలుకూరు : మండల కేంద్రంలో కోదాడ- జడ్చర్ల జాతీయ రహదారి వెంట విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయి. స్తంభాలు ఒరిగి ఎప్పుడు కూలుతాయో అనే విధంగా ఉన్నాయి. అయినా సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. చిలుకూరులోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పక్కనే విద్యుత్ స్తంభం వరిగి ఉంది. గాలికి విద్యుత్ స్తంభం కూలితే పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ మీద పడి పెద్ద ఎత్తున ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అలాగే ఇదే రహదారి వెంట మరో చోట విద్యుత్ స్తంభం వరిగి తీగల మీద నిలిచింది. అసలే ఇది 11 కేవీ విద్యుత్ లైన్ కావడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. నిత్యం ఈ రహదారి వెంట ఉన్నత స్థాయి అధికారులు, మండల స్థాయి విద్యుత్ అధికారులు, సిబ్బంది తిరుగుతున్నా చూసి కూడా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఒరిగిన విద్యుత్ స్తంభాలను తొలగించి నూతన స్తంభాలు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.

స్తంభాలను పరిశీలిస్తా



చిలుకూరులో జాతీయ రహదారి వెంట విద్యుత్ స్తంభాలు ఒరిగి ఉన్న సమస్య నేటి వరకు నా దృష్టికి రాలేదు. వెంటనే ఒరిగి ఉన్న స్తంభాలను పరిశీలిస్తా. ఒరిగిన విద్యుత్ స్తంభాల స్థానంలో సాధ్యమైనంత త్వరగా కొత్త స్తంభాలు ఏర్పాటు చేస్తాం.

– సైదయ్య, ట్రాన్స్‌కో ఏఈ, చిలుకూరు